కుష్ఠు నివారణకు సమష్టి కృషి

● అవగాహన ర్యాలీలో మేయర్ అముద

చిత్తూరు రూరల్: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ అముద అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా సోమవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు మాట్లాడారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే క్రమం తప్పకుండా మందులు వాడి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావొచ్చన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స గురించి తెలియజేశారు. వ్యాధిగ్రస్తులను ప్రజలు చిన్నచూపు చూడరాదన్నారు. ఇంటింటా సర్వే చేసి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు రెడ్డెప్ప, సాయి షర్మిలా, గుణశేఖర్, జాన్ పాల్గొన్నారు.

బీఎస్‌ఆర్‌పేటలో..

చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేటలో వైద్య బృందం గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించింది. కుష్ఠు వ్యాధి లక్షణాలను తెలియజేసింది. కార్యక్రమంలో వైద్యాధికారి భాస్కర్, సిబ్బంది భోగేశ్వ రపిశెల్లై తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో లెప్రసీ నివారణ

పూతలపట్టు: కుష్ఠువ్యాధికి అవగాహన కలిగించడమే నివారణ మార్గమని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రవీణ అన్నారు. కుష్ఠు వ్యాధి బారిన పడిన వారి సంరక్షణ కోసం జాతిపిత మహాత్మ గాంధీ చేసిన ప్రయత్నాలు, సేవలు మరవలేనివన్నారు. అందుకే మహాత్ముని వర్ధంతిని కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు, ఆరోగ్యకేంద్రాలను సంప్రదించాలని కోరారు. అనంతరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పురవీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

బంగారుపాళెం: కుష్ఠురహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో సోమవారం కుష్ఠు నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్, సీహెచ్‌ఓ షమీమ్, ఫ్యామిలీ ఫిజిషియన్ సిబ్బంది, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: కుష్ఠువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి తెలిపారు. సోమవారం తవణంపల్లెలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ ఆరోగ్య మిషన్ సౌజన్యంతో కుష్ఠువ్యాధితో పోరాడుదాం.. కుష్ఠువ్యాధిని గత చరిత్ర మార్చేద్దాం నినాదాలు చేస్తూ కుష్ఠువ్యాధిపై పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, పీహెచ్‌ఎన్ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ భారతి, డీపీఎంఓ మణి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





చిత్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులు, అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు





అవగాహన ర్యాలీ చేస్తున్న ఆశా కార్యకర్తలు, బంగారుపాళెం: కుష్ఠు నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా

117 మందికి వైద్యసేవలు



మాధవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం మండలంలోని మాధవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక 117 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎం చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుశీలమ్మ

ఐరాల: స్పందనలో వచ్చే అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని తహసీల్దార్ సుశీలమ్మ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వినతులను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తామన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



వంటగదిని పరిశీలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మద్దిపట్లపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంట గదిని పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

నేడు వాహనాలకు బహిరంగ వేలం

గంగవరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడి గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 31 ద్విచక్ర వాహనాలకు గంగవరం స్టేషన్ ఆవరణంలో నేడు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ప్రవేశ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పుంగనూరులో

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంపాటలో నిబంధనల మేరకు పాల్గొనాలని కోరారు.

నందిపై కాశీ విశ్వేశ్వరుడు



పలమనేరు: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు సోమవారం అధికార నందివాహనంపై ఊరేగారు. ఆలయం వద్ద ఉదయం అభిషేకం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న పవిత్ర

పలమనేరు: మున్సిపల్ పరిధిలో స్పందనకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను ఆలకించి వారిచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపారు.

మూల్యాంకనం పర్యవేక్షణ



ఎమ్మార్సీలో పాఠ్యాంశాల మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఆర్పీ సుబ్రమణ్యం

బంగారుపాళెం: విద్యామృత మహోత్సవ ప్రాజెక్టుకు సంబంధించిన పాఠ్యాంశాల మూల్యాంకనాన్ని సోమవారం జిల్లా రిసోర్సు పర్సన్ సుబ్రమణ్యం పర్యవేక్షించారు. స్థానిక ఎంఆర్‌సీలో విజయపురం మండలానికి సంబంధించి అన్ని పాఠ్యాంశాలను రిసోర్సు పర్సన్లు మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యామృత మహోత్సవ్‌లో భాగంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు సంబంధించి టాపిక్‌ను ఎంచుకుని వీడియో చేసి దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. వీటిని మూల్యాంకనం చేసి మార్కులు వేసి జిల్లా కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. ఉత్తమ టాపిక్‌కు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర రావు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

బంగారుపాళెం: అక్రమ మద్యం రవాణా కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు చిత్తూరు ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) మేఘస్వరూప్ పర్యటించారు. పుణ్యసముద్రం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి, రైతులకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందితో ఆరా తీశారు. అదేవిధంగా తవణంపల్లె వెటర్నరీ హాస్పిటల్‌ను సందర్శించారు. మండలంలో పశువులు, పాడి ఆవులు, మేకలు, గొర్రెల వివరాలు తెలుసుకున్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాల గురించి డాక్టర్ లావణ్య వివరించారు. అనంతరం ఎగువ తవణంపల్లెలోని ఆదర్శరైతు వినోద్ రెడ్డి గానుగలతో నూనె తీయడాన్ని, పుంగనూరు జాతి ఆవులను, ఆవు పేడతో తయారు చేస్తున్న పిడకలు, జీవామృతం, ఘనామృతం తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మడవనేరిలోని ఆదర్శరైతు పూర్ణచంద్రారెడ్డి పోషిస్తున్న దేశీయ ఆవులను పరిశీలించారు. ఆయన వెంట పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వెంకటరావు, ఉప సంచాలకులు డాక్టర్ ప్రభాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రమోహన్, తవణంపల్లె మండల పశువైద్యాధికారులు డాక్టర్ లావణ్య, డాక్టర్ పల్లవి, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయం గురించి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) మేఘస్వరూప్

గాంధీజీ బోధనలు అనుసరణీయం : ఆర్డీఓ





గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్డీఓ రేణుక, నగర పాలక సంస్థ కార్యాలయంలో..

చిత్తూరు కలెక్టరేట్: నవభారత నిర్మాణానికి గాంధీ మహాత్ముడి బోధనలు అనుసరణీయమని ఆర్డీఓ రేణుక అన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి పురస్కరించుకుని తన కార్యాలయంలో ఆర్డీఓ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను స్మరించారు. కార్యక్రమంలో ఏఓ రామాంజులునాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి నగర మేయర్ ఎస్.అముద పూలమాల వేసి నివాళులు అర్పించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మి తదితరులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, గోపాలకృష్ణ వర్మ, నగరపాలక అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీలను పూతలపట్టు ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. సోమవారం మండలంలోని ఆకనంబట్టు, వేపనపల్లి గ్రామ జగనన్న కాలనీలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆధారాలు, నిర్మాణపనుల గురించి అడిగి తెలుసుకున్నారు. వీలైనంత వరకు తొందరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. అప్పుడే బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ ఎంఎస్ మణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి పంచలోహ కవచాలు



కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి స్థానికులు లలితా దేవారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం పంచలోహ కవచాలు అందజేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి తెలిపారు. లలితా దేవారెడ్డి కుటుంబ సభ్యులు గతంలో కూడా సుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుమారాచారి, పయణిరెడ్డి, ఎంపీటీసీ చంద్రమ్మ, కర్పగం, చెంగమ్మ, దీపక్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

రేపు తలనీలాల వేలం

వడమాలపేట: మండల పరిధిలోని సదాశివకోనలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాలు పోగు చేసుకొనే హక్కు కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వడమాలపేట అంజనేయస్వామి ఆలయంలో ఫిబ్రవరి1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం ఉంటుందని చెప్పారు. పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలంలో ఈ హక్కు దక్కించుకున్నవారు సదాశివకోనలో ఫిబ్రవరి 17 నుంచి 19 వతేదీ వరకు తలనీలాలను పోగు చేసుకోవచ్చని తెలిపారు.

'స్పందన'కు 10 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: 'స్పందన' వినతులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ జె.అరుణ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ‹స్పందన›లో కమిషనర్ ప్రజల నుంచి మొత్తం 10 వినతులు స్వీకరించారు. నీటి సరఫరా కోసం బోర్‌వెల్ ఆపరేటర్‌ను నియమించాలని 12వ వార్డుకు సంబంధించి మహిళలు, అలాగే కొత్త బస్టాండ్ వద్దనున్న నగర పాలక కాంప్లెక్స్‌లో మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని వినతి పత్రం ఇచ్చారు. ప్రతి వినతి పత్రాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవ శోభతో ఉత్సవమూర్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి నిత్య కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లను పలు రకాల సుగంధ పుష్పాలతో అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం గణపతి, నవగ్రహ, యజ్ఞోపవీత, మాంగల్యపూజలు చేయడంతోపాటు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

కొండమల్లీశునికి పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేశారు. వేకువజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం పాలాభిషేకం చేశారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తిరుపతిలో పాప్ కార్న్ చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న పాప్‌కార్న్ హీరో సాయి రోనాక్

తిరుపతి కల్చరల్: పాప్ కార్న్ చిత్రం సరికొత్త ట్రెండ్ జోనర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని హీరో సాయి రోనాక్ తెలిపారు. ఆచార్య క్రియేషన్స్ ఆధ్వర్యంలో మురళి గంధం దర్శకత్వంలో రూపొందించిన పాప్ కార్న్ ఫిబ్రవరి 10న విడుదల కానుంది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఎంఆర్ పల్లి, న్యూబాలాజీ కాలనీలోనున్న ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలకు వచ్చింది. హీరో సాయి రోనాక్, హీరోయిన్ అవికా గోర్ మీడియాతో మాట్లాడుతూ పాప్ కార్న్ మంచి లవ్‌స్టోరీ సినిమా అని తెలిపారు. దర్శకుడు మురళి గంధం మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక ప్రేమ కథా చిత్రాలు వచ్చాయని, తాము నిర్మించిన ఈ చిత్రం డిఫరెంట్ జోనర్‌లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్రం నిర్మాతలు చలపతి, భోగేంద్ర గుప్త తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఐరాల: మండలంలోని బొమ్మసముద్రం పంచాయతీ బొమ్మసముద్రం దళితవాడ, తిరువణంపల్లె దళితవాడలో సోమవారం అభివృద్ధి పనులకు సర్పంచ్ రఘు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు బొమ్మసముద్రం దళితవాడ, తిరువణంపల్లె దళితవాడ గ్రామ ప్రజలు సీసీ రోడ్డు వేయాలని, అండర్ డ్రైనేజీ నిర్మించాలని, కొత్త బోరు మోటారు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే బొమ్మసముద్రం దళితవాడలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు, తిరువణంపల్లె దళితవాడలో రూ.3 లక్షలతో అండర్ డ్రైనేజీ, రూ.1.5 లక్షలతో కొత్త బోరు మోటారు, పంచాయతీలో రూ.1.5 లక్షలతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయకుమారి, సచివాలయ సెక్రటరీ మౌనిక పాల్గొన్నారు.



అండర్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రఘు

సీతమ్స్ లెక్చరర్‌కు మద్రాస్ ఐఐటీ ప్రశంసా పత్రం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న పళనివేల్‌కు మద్రాస్ ఐఐటీ యాక్టివ్ స్పాక్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించింది. ఇంజినీరింగ్ విద్యార్థులు సులభ పద్ధతిలో కోర్సులు చేయడానికి స్వయమ్ ఆన్‌లైన్ లెర్నింగ్ పై అవగాహన కల్పించారు. లెర్నింగ్‌పై అవగాహన పెంచుకున్న విద్యార్థులు గత ఐదేళ్లలో నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగాలు సాధించారు. ఇందుకు గాను మద్రాస్ ఐఐటీ పళనివేలు సర్టిఫికెట్ ప్రదానం చేసింది. ఆయనను సీతమ్స్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి, సహచర అధ్యాపకులు అభినందించారు.



పళనివేల్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న సీతమ్స్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి

అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ సాగర్‌బాబు



మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ పాలకమండలి, అధికారులు కృషి చేస్తున్నారు. దీనికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ధూర్జటి కళాప్రాంగణం వద్ద పనులు వేగవంతం చేశారు. అలాగే పట్టణ పలు ప్రధాన మార్గాల్లో ఆర్చిలను, ఆలయ సమీపంలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు.

ఏర్పాట్లపై ఈఓ సమీక్ష

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆలయంలోని పరిపాలన భవనంలో ఈఓ సాగర్‌బాబు ఆలయ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కలసికట్టుగా విజయవంతం చేయాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలన్నారు.

